# సుబ్రావ్ కథ

రచన:
శ్రీ కూతురు రాంరెడ్డి

రాత్రి తొమ్మిది గంటలు దాటింది.

సుబ్రావ్ టేబుల్ ముందు - టేబుల్ లాంపు క్రింద కూర్చున్నాడు

సిగరెట్ త్రాగుతూ ఎడమ చేయి గెడ్డానికి ఆనించి కథ రాస్తున్నాడు - కాదు కాదు కథ ఆలోచిస్తున్నాడు. మెదడంతా కరిగి పోతుంది. బుర్రంతా వేడెక్కుతుంది సిగరెట్ ప్యాకెట్టయిపోయింది. ఆలోచనల్లో రెండు గంటలూ తనను చూస్తూ వెకిలిగా నవ్వుతూ ముందుకు పరుగెత్తాయి. ఐనా కథ మెదడుకు రావడం లేదు. టేబుల్ సొరుగులోంచి ఓ చాకొలెట్ తీసి చప్పరిస్తూ కూర్చున్నాడు.

కిటకిటమని బటానీలు నములుతూ లోపల్నుంచి పరుగెత్తుకొచ్చింది ధనలక్ష్మి "సుబ్బుప్రియా కాఫీ, పాలూ?" అడిగింది.

"ఉఁహు .. నాకు కాఫీ వద్దు-పాలే కావాలి."

"ఏం?"

"కాఫీ త్రాగుతే థాట్ రావడం లేదు. పాలు త్రాగుతే ఓ చక్కని థాటు మెదడులోకి వచ్చి కూర్చుంటుందేమో!"

వెర్రి నవ్వు నవ్వింది ధనలక్ష్మి.

లోపలికెళ్ళింది.

స్టౌ వెలిగించింది.

పాలు కాచుకొని పరుగెత్తుకొచ్చింది.

సుబ్బుప్రియు చేతికందించింది.

"నువ్వింక లోపలికెళ్ళు."

"ఊఁ," నేను వెళ్ళనన్నట్లుగా అంది ధనలక్ష్మి

"మై డియర్ ధనలక్ష్మీ... శుభ్రంగా వెళ్ళి ఆ క్యాప్ కట్ లాంటి బెడ్ రూంలో పడుకోపో... నువ్విక్కడుంటే ఈ సరస్వతి కోపగించుకొని నా దగ్గర్నుండి వెళ్ళిపోతుంది..."

బుద్ధిమంతురాలిగా వెళ్ళి పడుకుంది ధనలక్ష్మి.

మళ్ళీ కథ గురించి ఆలోచించడం మొదలెట్టాడు సుబ్రావ్ పాలు త్రాగేసి.

కొంచం సేపటికి ఓ చక్కని కథ అతని మెదడులోకి జొరబడింది.

టకటకా కాగితాలు సవరించుకున్నాడు.

పెన్ను కాగితంమీదికి వెళ్ళింది.

కరెంటు పోయింది.

కోపంగా టేబుల్ లాంపును తోశాడు. అది క్రింద పడిపోయింది. ఐనా బల్బు మాత్రం పగలలేదు. తను చేసింది పొరపాటని తెలిసి తిరిగి ఆ లాంపును తీసి టేబుల్ పైకెక్కించాడు సుబ్రావ్.

"ఏం ప్రియా, సరస్వతి వెళ్ళిపోయిందా?" దయ్యమల్లే మెల్లగా వచ్చింది ధనలక్ష్మి.

"మహోగ్రుడై) ధనలక్ష్మి వంక చూశాడు సుబ్రావ్' ఆ కోపాన్ని చూచి ఆమె అదిరిపోయి వెళ్ళి పడుకుంటుందేమోనని, కాని, చీకట్లో అతని మొహం ఆమెకు కనుపించలేదు. అక్కడినుండి వెళ్ళలేదు.

"ఏదైనా కథ మెదడులోకి వచ్చిందా ప్రియా?" రెండు చేతులూ సుబ్రావ్ బుజాలపై ఆనించింది.

అతనిలోని కోపం కొద్దిగా తగ్గింది.

'ఓ చక్కని కథ వచ్చింది డియర్! రాయాలని కలంబూనే సరికి ఈ బ్రూట్-రాస్కెల్-ఇడియట్ కరెంటు పోయింది."

"ఏం కథ, నాకు చెప్పవూ?"

"ఉఁహు, చెప్పను! పోటీకి పంపాక, బహుమతి వచ్చాకే నీవు చదవాలి."

నవ్వింది ధనలక్ష్మి.

ఆ నవ్వు గలగలా పారే సెలయేరులా లేదు.

వెకిలిగా ఉంది.

"ఎందుకలా నవ్వుతున్నావ్!?"

ఏం చెప్పలేదు ధనలక్ష్మి.

అతని బుజంపైని రెండు చేతుల్నీ జార్చి, అతని తల వెనుక భాగాన్ని తన గుండెల్లో దాచుకొని "చలేస్తోంది ప్రియా!" అంది.

"ఐతే నన్నేం చేయమంటావు?"

"చాలా రాత్రయింది. ఇక పడుకుందాం."

"ఊఁహూ, వీల్లేదు... ఈ రాత్రి కథ రాసేంతవరకు నాకు నిద్ర బట్టదు." అని అతని మనస్సు అనలేదు, నాలుక అంది.

ధనలక్ష్మి డియర్ గుండెలు ఎంతో వేడిగా ఉన్నాయ్. హాయిగా లోకాన్ని మరచాను. కొంచం కొంచం నిద్ర వుంచుకొస్తుంది.

అరగంట - కాదు, గంట అలా గడిచిపోయింది.

కరెంట్ వచ్చింది.

దిగ్గున లేచున్నాడు సుబ్రావ్.

పెన్ చేతిలోకి తీసుకున్నాడు.

కథ మెదడులోంచి పోయింది.

ఆలోచిస్తుంటే ఏ కొద్దిమాత్రం సంఘటనలే గుర్తొస్తున్నాయ్.

అలా మరోగంట సతమతమై పోయాడు సుబ్రావ్.

కోపం నిలువెల్లా నిండి పోయింది.

ఆ కోపాన్ని కరెంటుపై ప్రదర్శించాలో అర్థంగి ధనలక్ష్మి డియర్ పై ప్రదర్శించాలో అర్థం గాక, అన్నీ సర్దేసి, టేబుల్ లాంపు ఆర్పి బెడ్‌రూంలోకెళ్ళి పడుకున్నాడు.

ఆలోచనల్లో తన్నంటుకోక పోతేనేమి - ధనలక్ష్మి డియర్ హాయిగా అతన్ని దగ్గరకు తీసుకొని - తనువంతా పెనవేసి - అతని ఆలోచనల్ని దూరం చేసి నిద్ర పుచ్చింది.

ఓ రాత్రి కిటకిట శబ్దంతో సుబ్రావ్ - "అబ్బబ్బ! ఈ ఎలుకలు దిన దినానికీ మితిమీరి పోతున్నాయ్.." అంటూ దిగ్గున పడక పైనుంచి లేచి కూర్చున్నాడు.

ధనలక్ష్మి డియర్ నవ్వి "ఎలుకలు కాదు ప్రియా! నేనే..." అంది మరో నాలుగు బటానీలు నోట్లో వేసుకొని నములుతూ.

చాలా కోపమొచ్చింది సుబ్రావ్‌కు - "ఇప్పుడా! ఛీ... బటానీలు కొరకకపోతే నీ గుండె టక్కున ఆగి ఊరుకుంటుందా?" అన్నాడు.

"కథ ఆలోచిస్తున్నాను ప్రియా!"

"నా తలకాయ ఆలోచించు!"

"నీ తలకాయ గురించి ఎందుకు ఆలోచిస్తాను... నీ తలకాయలోకి దూరిపోయే కథ...నీకు నచ్చిన కథ ...నువ్వు రాయగల్గిన కథ...బహుమతి పొందే కథ ఆలోచిస్తాను...!"

సుబ్రావ్ అదే కోపంతో టక్కుని పడుకొని, కాళ్ళ దగ్గరున్న దుప్పటిని లాక్కొని - ముసుగుదన్ని పడుకున్నాడు.

మర్నాడు ఉదయం ఏడు గంటలకే మేల్కొని, కాఫీ కాచి - తనో కప్పు త్రాగి - సుబ్బు ప్రియను మేల్కొల్పింది ధనలక్ష్మి డియర్.

సుబ్రావ్ బుద్ధిగా మేల్కొని, మొహం కడుక్కొని, కాఫీ త్రాగాడు.

అతడు కాఫీ త్రాగాక - తను రాత్రి ఆలోచించిన కథ సుబ్రావ్‌తో చెప్పింది ధనలక్ష్మి.



అందానికి, మన్నికకు
రోజా

RegdNo 221631
బనియన్లనే వాడండి

సుబ్రావ్‌కు కథ ఎంతో నచ్చింది. మెదడులోకి జొచ్చింది. "ఏమో అనుకున్నాను డియర్, నీ బుర్ర విలువైందే!" అన్నాడు ధనలక్ష్మి డియర్‌ను దగ్గరకు తీసుకొని.

"మరి, అంతా బటానీల మహాత్మ్యం."

టేబుల్‌పై కూర్చొని కథ రాయసాగాడు సుబ్రావ్.

కథ ఏ అంతరాయం లేకుండా సాఫీగా సాగిపోయింది.

అదే రాత్రి ఫెయిర్ చేసి - మర్నాడు పత్రికకు రిజిస్టర్డ్ పోస్ట్ చేశాడు.

'మన కథకి ఏదో ఒక బహుమతి తప్పకుండా వస్తుంది ధనలక్ష్మి డియర్." సుబ్రావ్ సంతోషంతో పొంగిపోయాడు.

"ఇంతకీ కథ పేరు ఏం పెట్టారు?"

"సుబ్లక్ష్మి"

"ఛీ! ఆ పేరెందుకు పెట్టారు. అంతకంటే మంచి పేరు దొరకలేదా?'

"దొరకలేదు డియర్! అయినా ఆ పేరే అప్రోప్రియేట్‌గా ఉంది. అందునా నువ్వూ, నేనూ - అంటే సుబ్రావ్ రచన ప్లస్ ధనలక్ష్మి కథ - రెండూ కలసి "సుబ్బలక్ష్మి" అయిపోయింది ఆ కథ.

పదిహేను రోజులు గడవకముందే సుబ్రావ్‌కు పత్రిక వారినుండి ఒక టెలిగ్రాం వచ్చింది. అందులో తన కథ మూడవ బహుమతి పొందినట్లు, తన ఫోటో మరియు వివరాలు త్వరగా పంపమన్నట్లుంది.

సుబ్రావ్ సంతోషంతో పొంగి ఆకాశాన్నంటాడు.

ధనలక్ష్మి మొహంలో గర్వం దట్టుపడుతుంది.

ఆ రోజే ఇద్దరూ కలిసి ఒక ఫోటో తీసి వివరాలతో సహా మరునాడు పత్రికకి పంపించారు.

నెలరోజులు అనుకోకుండా గడచిపోయాయి.

ఈ లోగా సుబ్రావ్ తన మిత్రు లందరికీ గర్వంగా చెప్పుకున్నాడు.

ప్రతీ ఒక్కర్నీ ఆ పత్రిక కొని చదివి, అభిప్రాయం తనకు చెప్పి, పత్రికవారికి రాయమన్నాడు.

పత్రికలు కొనలేనివాళ్ళకు తనే కొనిస్తానన్నాడు.

పత్రిక ప్రత్యేక సంచిక విడుదలయ్యే రోజులు సమీపిస్తున్నాయి.

ఆ రోజు కోసమే ఎంతో కుతూహలంగా ఎదురు చూస్తున్నాడు సుబ్రావ్.

ప్రత్యేక సంచిక విడుదలైంది.

బజారు కెళ్ళి ఓ పత్రిక కొనుక్కొని, గబగబా ఇంటికొచ్చి పేజీలు తిరగేశాడు "సుబ్లలక్ష్మి" కథ పెద్ద అక్షరాలలో కనబడింది.

ధనలక్ష్మి అతని చేతిలోంచి పత్రిక లాక్కుబోతూ "ముందు మన ఫోటో పడిందో చూడండి" అంది ఆతృతగా.

సుబ్రావ్ పేజీలన్నీ తిరిగేశాడు. సుబ్రావ్ ప్లస్ ధనలక్ష్మి ఫోటో, వివరాలూ ఎక్కడా కనిపించలేదు.

మొదటి, రెండవ బహుమతులు పొందిన రచయితల ఫోటోలు, వివరాలుండి - వారి వివరాలూ, ఫోటో లేక పోయేసరికి ఆశ్చర్యంతో వెర్రి మొహాలేసుకొని - ఒకరి మొహాలొకరు చూసుకున్నారు.

"ఏమైందసలు!? మనం పంపిన కవరు ఎక్కడైనా మిస్సయిందేమో!" అన్నాడు సుబ్రావ్.

అతని మొహమంతా చెమట పట్టింది.

పత్రికలో ఎక్కడైనా గమనిక ఉందేమో నని గబగబా పత్రికంతా చూసింది ధనలక్ష్మి. కాని, ఎక్కడా ఆ గమనిక కనుపించలేదు. "ఛీ! అంతా బూడిదలో పోసిన పన్నీరైంది." అంది బిక్కమొహం పెట్టి.

"ఇప్పుడే పత్రికకి రాస్తానుండు" అంటూ డ్రాయరు సొరుగు లాగాడు సుబ్రావ్.